క్లుప్తంగా

ఈవీఎంల భద్రతపై పరిశీలన



మాట్లాడుతున్న జిల్లా రెవెన్యూ అధికారి జె. వెంకటరావు

సీతానగరం: పార్వతీపురం మన్యం జిల్లాలో పోలింగ్ నిర్వహించే ఎల్రక్టానిక్ మెషీన్లు భద్రపరచడానికి గొడౌన్లను పరిశీలిస్తున్నామని జిల్లా రెవెన్యూ (డీఆర్వో)అధికారి జె. వెంకటరావు తెలిపారు. ఈ మేరకు మండలంలోని సూరంపేట (మరిపివలస) పాలిటెక్నిక్ కాలేజీ భవనాలను మంగళవారం పార్వతీపురం ఆర్డీఓ కె.హేమలత, డివిజినల్ సర్వే అధికారి సూర్యనారాయణ, తహసీల్దార్ ఎన్వీ రమణలతో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా డీఆర్వో మాట్లాడుతూ జిలాల్లో ఎన్నికలు నిర్వహించడానికి ఎన్నికల కమిషన్ సమకూర్చిన ఈవీఎంలను జిల్లాలో భద్రపర్చడానికి గొడౌన్ల అవసరం వచ్చిందన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ నిషాంత్ కుమార్ సూచనల మేరకు గరుగుబిల్లి, పార్వతీపురం, కొమరాడ,సీతానగరం మండలాల్లో ఖాళీగా ఉన్న ఉన్న భవనాలను పరిశీలిస్తున్నామని అందులో భాగంగా సీతానగరం మండలంలోని మరిపివలస పాలిటెక్నిక్ కాలేజీలో భవనాలను పరిశీలించినట్లు తెలియజేశారు. కార్యక్రమంలో మండల సర్వేయర్ శంకరరావు, వీఆర్వోలు పాల్గొన్నారు.

గ్రీన్ అంబాసిడర్ల వినతి



సబ్‌కలెక్టర్‌కు వినతిపత్రం అందిస్తున్న గ్రీన్ అంబాసిడర్లు

పాలకొండ: సమస్యలు పరిష్కరించాలని కోరుతూ గ్రామ పంచాయతీల్లో పనిచేస్తున్న గ్రీన్ అంబాసిడర్లు మంగళవారం ర్యాలీ నిర్వహించారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు దావాల రమణారావు ఆధ్వర్యంలో పట్టణంలోని ఏలాం కూడలి నుంచి ఆర్డీఓ కార్యాలయం వరకు ర్యాలీ చేపట్టారు. అనంతరం సబ్‌కలెక్టర్ నూరుల్ కమర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రమణారావు మాట్లాడుతూ గ్రీన్ అంబాసిడర్లకు 6 నుంచి 15 నెలల వేతనాలు బకాయి ఉన్నాయన్నారు. కొన్ని పంచాయతీల్లో పూర్తి వేతనాలు అందించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై సబ్‌కలెక్టర్ స్పందిస్తూ సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని అన్నారు.

క్రీడాకారుడికి అభినందన



క్రీడాకారుడు కార్తికేయను అభినందిస్తున్న ప్రిన్సిపాల్, తదితరులు

పాలకొండ రూరల్: క్రీడల్లో పాలకొండ ప్రాంత ప్రతిభను ఎక్కడకు వెళ్లినా ఇనుమడింపజేయాలని స్థానిక డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ జి.జనార్దననాయుడు అన్నారు. ఇటీవల శ్రీకాకుళం జిల్లా భైరిసింగుపురంలో జరిగిన జిల్లాస్థాయి కబడ్డీ పోటీల్లో కళాశాలకు చెందిన క్రీడాకారుడు బెహరా కార్తికేయ ప్రథమ బహుమతి సాధించినట్లు చెప్పారు. కళాశాలలో మంగళవారం సదరు క్రీడాకారుడిని అభినందించారు. రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల్లో రాణించి కళాశాలకు ఖ్యాతి తీసుకురావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ ప్రభాకరరావు, ఐక్యూ కోఆర్డినేటర్ బి.రాజు, ఫిజికల్ డైరెక్టర్ సీతారాం, అధ్యాపక సిబ్బంది ఉన్నారు.

రైతు నాయకుడు సింహాచలం



సింహాచలం చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న ప్రజా సంఘాల నాయకులు

భామిని: రైతు సంఘం నాయకుడు దివంగత బర్రి సింహాచలం వర్ధంతిని మంగళవారం నిర్వహించారు. పలువురు ప్రజా సంఘాల నాయకులు సింహాచలం చిత్రపటం వద్ద పూలువేసి నివాళులర్పించారు. కౌలు రైతుల సమస్యలపై ఆయన చేసిన పోరాటాన్ని ఈ సందర్భంగా గుర్తుచేసుకున్నారు. ఐద్వా నాయకురాలు బర్రి పార్వతి, సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యులు ఎం.తిరుపతిరావు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు సిర్ల ప్రసాద్, సీపీఎం మండల కార్యదర్శి జి.జగన్నాయకులు, కె.మిన్నారావు, ఎన్.ప్రసాద్, ఎం.అప్పలస్వామి తదితరులు పాల్గొన్నారు.

పండగ వాతావరణంలో

‘జగనన్నే మా భవిష్యత్’

- ఇంటింటికీ తిరుగుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు



సీతానగరం: పెదభోగిలిలో ప్రజల మద్దతు కోరుతున్న సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు,న వైఎస్సార్‌సీపీ నాయకులు

సీతానగరం: మండలంలోని గ్రామాల్లో ఐదు రోజులుగా ఎమ్మెల్యే అలజంగి జోగారావు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ‘జగనన్నే మా భవిష్యత్తు’, మా నమ్మకం నువ్వే జగన్’ కార్యక్రమాలు పండగ వాతావరణంలో సాగుతున్నాయి. ఈ కార్యక్రమాల్లో భాగంగా ప్రతి ఇంటికీ వెళ్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులకు ప్రజలు నీరాజనం పలుకుతున్నారు. వైఎస్సార్‌సీపీ మండల నాయకులు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులతో గ్రామస్తులు మాట్లాడుతూ తామంతా సంక్షేమ పథకాలు ఇంటికి తెచ్చి ఇస్తున్న జగనన్న ప్రభుత్వానికి మద్దతు ఇస్తామని చెబుతూ స్వచ్ఛందంగా స్టిక్కర్లు ఇళ్లలో అతికిస్తున్నారు. ఈ క్రమంలో పెదభోగిలిలో సచివాలయ కన్వీనర్లు, వార్డు మెంబర్లు మెగా పీపుల్స్ సర్వే నిర్వహిస్తున్నందున తమమద్దతు జగనన్నకే అంటూ ప్రజలు నినాదాలు చేస్తున్నారు. అలాగే అన్నిగ్రామాల్లో పార్టీ శ్రేణులంతా ఇంటింటి ప్రచారంలో నిమగ్నమయ్యారు. కార్యక్రమంలో పెదభోగిలి, సీతానగరం సచివాలయాల నాయకులు ఎస్.కిరణ్‌కుమార్, పి.రామారావు,బి సూర్యనారాయణ, ఎస్.రమేష్ పాల్గొని ప్రజల మద్దతు కూడగట్టారు.

జగనన్నతోనే మన అభివృద్ధి

బలిజిపేట: మండలంలోని వివిధ గ్రామాలలో ‘జగనన్నే మా భవిష్యత్’ కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. అందులో భాగంగా బలిజిపేటలో సర్పంచ్ రాఘలత, మండల ఉపాధ్యక్షుడు సాయిరాం, కన్వీనర్లు, గృహసారథుల ఆధ్వర్యంలో ఇంటింటికీ వెళ్లి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ రాఘలత మాట్లాడుతూ జగనన్నతోనే అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలు సాధ్యపడుతుందన్నారు.

అటువంటి వ్యక్తిని తిరిగి గెలిపించుకుని మన అభివృద్ధిని మనమే సాధించుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, నాయకులు, గృహసారథులు, కన్వీనర్లు, వలంటీర్లు, కార్యకర్తలు పాల్గొన్నారు.



బలిజిపేట: ఇంటింటికీ తిరుగుతున్న కన్వీనర్లు, గృహసారథులు, నాయకులు

నవరత్నాలతో నవశకం



లబ్ధిదారులకు బుక్‌లెట్ అందించి వివరాలు తెలుసుకున్న ఎమ్మెల్యే జోగారావు

- ఎమ్మెల్యే జోగారావు

బలిజిపేట: సీఎం జగన్‌మోహన్ రెడ్డి ప్రవేశపెట్టిన నవరత్నాలతో రాష్ట్రంలో నవశకం ప్రారంభమైందని ఎమ్మెల్యే జోగారావు తెలిపారు. ఈ మేరకు బలిజిపేట మండలంలోని నారాయణపురంలో మంగళవారం ఆయన గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నవ రత్నాల్లాంటి పథకాలను ప్రవేశపెట్టి రాష్ట్రంలో అన్ని వర్గాలవారికి సంక్షేమ పథకాలను అందిస్తున్న ఏకైక ప్రభుత్వం జగన్‌మోహన్ రెడ్డి నేతృత్వంలోని ప్రభుత్వమే అన్నారు. తల్లి గర్భంలో పిల్ల ఉన్నప్పటి నుంచి ఉన్నతమైన చదువులు చదుకునేంతవరకు ప్రభుత్వమే సంక్షేమ పథకాలను అందిస్తోందన్నారు. అలాగే రైతులకు రైతు భరోసా, నిరుపేదలకు సొంతిల్లు, మహిళల జీవనోపాధి మెరుగుదలకు వివిధ సంక్షేమ పథకాలను అమలు చేస్తూ రాష్ట్రంలో సంక్షేమ పాలన అందిస్తున్నారన్నారు. ప్రభుత్వ పాఠశాలలు, హాస్పిటల్స్‌లో నాడు–నేడు పథకంతో సమూల మార్పులు తీసుకువచ్చింది తమ ప్రభుత్వమేనన్నారు.

గత పాలనను గమనించాలి

గత ప్రభుత్వంలో ఇటువంటి సంక్షేమం, అభివృద్ధి ఎక్కడ ఉందో ప్రజలు గమనించాలన్నారు. ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాలు సక్రమంగా ప్రజలకు అందుతున్నాయా? లేదో? తెలుసుకునేందుకే గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాల బుక్‌లెట్‌ను లబ్ధిదారులకు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ సుమలత, ఎంపీటీసీ రామకృష్ణనాయుడు, ఎంపీడీఓ భానుమూర్తి, ఎంపీపీ జి.నాగమణి, జెడ్పీటీసీ ఎ.రవికుమార్, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు మురళీకృష్ణ, సర్పంచ్ ఆర్.శ్రీనివాసరావు, మాజీ జెడ్పీటీసీ రాధ, ఎంపీటీసీ శ్రీరామూర్తి, ఎం.శ్రీను, జగన్, టి.ప్రసాదరావు పాల్గొన్నారు.

మహాత్మా జ్యోతిరావు పూలేకు

ఘనంగా నివాళులు



మహాత్మా జ్యోతిరావు పూలేకు నివాళులు అర్పిస్తున్న ప్రజాప్రతినిధులు, నాయకులు

పార్వతీపురంటౌన్:

మహాత్మా జ్యోతిరావు పూలే 196వ జయంతిని పురస్కరించుకుని పార్వతీపురం నియోజకవర్గం కేంద్రంలో గల వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో మున్సిపల్ చైర్‌పర్సన్ బోను గౌరీశ్వరి ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులంతా కలిసి మంగళవారం ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్‌పర్సన్ మాట్లాడుతూ ఎమ్మెల్యే అలజంగి జోగారావు జెడ్పీ సమావేశానికి హాజరైన మూలంగా ఆయన ఆదేశాల మేరకు పార్టీ కార్యాలయంలో పూలే జయంతి వేడుకలను నిర్వహించినట్లు చెప్పారు. సామాజిక తత్వవేత్త, ఉద్యమకారుడైన జ్యోతిరావు పూలే స్త్రీలకు ఆత్మస్థైర్యాన్ని కల్పించి వారి హక్కుల కోసం పోరాడి సాధికారత కల్పనకు కృషి చేసిన అని కొనియాడారు. జ్యోతిరావు పూలే స్ఫూర్తితో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్ర ప్రజలకు సుభిక్షమైన పరిపాలన అందిస్తున్నారన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు కొండపల్లి బాలకృష్ణ, మున్సిపల్ వైస్‌చైర్మన్ ఇండుపూరు గున్నేశ్వరరావు, పార్టీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ మంత్రి రవికుమార్, జేసీఎస్ కన్వీనర్ గొర్లి మాధవరావు, వైఎస్సార్‌సీపీ బలిజిపేట మండల అధ్యక్షుడు పాలవలస మురళీకృష్ణ, స్టేట్ డైరెక్టర్లు జొన్నాడ శ్రీదేవి, జిల్లా బీసీ సంఘం అధ్యక్షుడు ఎం.జగన్‌మోహనరావు, కౌన్సిలర్‌లు, కో ఆప్షన్ సభ్యులు, వార్డు కన్వీనర్లు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

బలిజిపేట: మండలంలోని పెదపెంకి గ్రామంలో గల నేతాజీ గ్రంథాలయం వద్ద జ్యోతి రావు పూలే జయంతి వేడుక ఘనంగా నిర్వహించారు. గ్రంథాలయ వ్యవస్థాపకుడు సంజీవనాయుడు ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా సంజీవనాయుడు మాట్లాడుతూ అట్టడుగు వర్గాల అణచివేతకు వ్యతిరేకంగా పోరాడిన యోధుడని పూలేను కొనియాడారు. నిమ్న వర్గాల హక్కులు, స్త్రీల సాధికారత, రైతుల కోసం ఎన్నో ఉద్యమాలను చేశారన్నారు. విద్య ప్రాధాన్యం గుర్తించిన ఆయన స్త్రీలు, అంటరాని కులాలకోసం ప్రత్యే పాఠశాలలను ఏర్పాటుచేశారని గుర్తు చేశారు. అటువంటి మహానుభావుని స్మరించుకోవడం ఎంతో అదృష్టమన్నారు. కార్యక్రమంలో పి.శంకర్, కె.శివ, ఎం.రామకృష్ణ, ఈ.మధు, జి.శ్రావణ్, చంద్ర, తదితరులు పాల్గొన్నారు.



బలిజిపేట: నేతాజీ గ్రంథాలయం వద్ద పూలే చిత్రపటానికి పూలమాలవేస్తున్న గ్రామస్తులు

ప్రతీ విద్యార్థికి విద్యాకానుక కిట్లు అందించాలి

- జేవీకే రాష్ట్ర పరిశీలకులు నరసింహులు

వీరఘట్టం:

వచ్చే విద్యాసంవత్సరంలో ప్రభుత్వ బడుల్లో చేరే ప్రతీ విద్యార్థికి జగనన్న విద్యాకానుక కిట్లు అందజేయాలని జేవీకే రాష్ట్ర పరిశీలకుడు వై.నరసింహులు అన్నారు. స్థానిక బాలికోన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన జేవీకే కిట్ల స్టాక్ పాయింట్‌ను మంగళవారం ఆయన పరిశీలించారు. అనంతరం అక్కడి సిబ్బందితో సమావేశమై పలు సూచనలు చేశారు. విద్యాకానుకల్లో ఏ మాత్రం క్వాలిటీ తగ్గినా వెంటనే వెనక్కి పంపించేయాలన్నారు. ఇక మీదట విద్యార్థులకు కొలతల ప్రకారమే బూట్లు అందజేస్తామన్నారు. జేవీకే కిట్లను పటిష్టంగా భద్రపరచాలని సూచించారు. కార్యక్రమంలో ఎంఈఓ పత్రి కృష్ణమూర్తి, హెచ్ఎం దూసి నాగమణి, సీఎంఓ కె.రాజారావు తదితరులు ఉన్నారు.

భామిని: ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు అందించే జగనన్న విద్యాకానుక కిట్లను భద్రపరిచేందుకు స్థానిక ఏపీ మోడల్ స్కూల్‌లో ఏర్పాటు చేసిన స్టాక్‌పాయింట్‌ను జేవీడీ రాష్ట్ర పరిశీలకుడు వై.నరసింహులు, జిల్లా సమగ్ర శిక్ష సీఎంఓ కె.రాజారావుతో కలిసి మంగళవారం పరిశీలించారు. మండలంలో 5104 మంది విద్యార్థులకు జగనన్న విద్యాకానుక కింద 9 రకాల వస్తువులను అందజేయనున్నట్లు చెప్పారు. విద్యాసంవత్సరం ప్రారంభమైన వెంటనే వాటిని విద్యార్థులకు అందించేందుకు తగిన చర్యలు తీసుకుంటున్నామన్నారు. అనంతరం మోడల్ స్కూల్ లైబ్రరీని పరిశీలించారు. ఆయనతో పాటు ఎంఈఓ ఎ.శ్రీనివాస్, వెలుగు ఏపీఎం దొడ్డ భవానీ, ఎంఐఎస్ కోఆర్డినేటర్ రామకృష్ణ, ప్రిన్సిపాల్ ఆర్.శివకుమార్ ఉన్నారు.

గ్రామాల్లోనే రోగనిర్ధారణ, వైద్యసేవలు

- డీఎంహెచ్ఓ డాక్టర్ బగాది జగన్నాథ రావు



మాట్లాడుతున్న డీఎంహెచ్ఓ డాక్టర్ బి.జగన్నాథరావు

సీతానగరం: గ్రామాల్లో ఫ్యామిలీ డాక్టర్ విధానాన్ని ప్రజలకు అందుబాటులో ఉండేలా అమలు చేసి రోగులకు వైద్య సేవలు అందించడానికి వైద్యులు, సిబ్బంది కృషిచేయాలని జిల్లావైద్యారోగ్య శాఖాధికారి డాక్టర్ బి.జగన్నాథరావు కోరారు. ఈ మేరకు మంగళవారం ఆయన సీతానగరం పీహెచ్‌సీ డాక్టర్ ఉషారాణి ఆధ్వర్యంలో గుచ్చిమిలో జరుగుతున్న ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని ఆకస్మికంగా సందర్శించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామానికి వచ్చేముందుగానే ప్రణాళిక తయారుచేసుకుని ప్రజలందరికీ తెలియ చేసేవిధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. గ్రామంలో దీర్ఘకాలంగా వ్యాధులతో ఇబ్బందులు పడుతున్న గర్భిణులు, బాలింతలు, 5 సంవత్సరాల వయస్సు లోపున్న పిల్లలకు ఆరోగ్యశ్రీ పథకం ద్వారా వైద్య చేయించేవారు? మంచంపై నుంచి కదలలేని రోగులు, సాధారణ రోగాలతో ఇబ్బందులు పడుతున్న వారు ఎంతమంది ఉన్నారో? నివేదిక తయారుచేయాలని స్పష్టం చేశారు. నివేదిక ఆధారంగా వారందరికీ సంతృప్తికరంగా వైద్య సేవలు అందించాలని సూచించారు.

సేవలందించేందుకు వైద్యసిబ్బంది సిద్ధం

అనంతరం శిబిరానికి హాజరైన రోగులనుద్దేశించి మాట్లాడుతూ ప్రభుత్వం ఇళ్లవద్దకే వైద్యులను పంపించి వైద్య సేవలను అందించాలన్న బృహత్తర కార్యక్రమాన్ని అమలు చేసిందన్నారు.104 సంచార వైద్య కేంద్రంలోనే రోగనిర్ధారణకు అవసరమైన వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కాలక్రమేణా ఇళ్లవద్దనే పటిష్టమైన వైద్య సేవలు అందించడానికి సిద్ధంగా ఉంటారన్నారు. వైద్య సేవలను రోగులు వినియోగించు కోవాలని కోరారు. కార్యక్రమంలో గుచ్చిమి సబ్‌సెంటర్ వైద్య సిబ్బంది, 104 సిబ్బంది దుర్గాప్రసాద్, ప్రసాద్ ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

పూర్తిస్థాయిలో వైద్యసేవలు

- వైద్యాధికారిణి సాహితి



దోకిశీల గ్రామంలో ఆరోగ్య సమస్యలు అడిగి తెలుసుకుంటున్న వైద్యాధికారిణి సాహితి

పార్వతీపురంటౌన్: ఇక నుంచి పూర్తిస్థాయిలో వైద్యసేవలు అందిస్తామని వైద్యాధికారిణి సాహితి అన్నారు. ఈ మేరకు మంగళవారం మండలంలోని డోకిశీల గ్రామంలో ఫ్యామిలీ డాక్టర్ విధానంలో వైద్యపరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామంలో ప్రతి నెలలో రెండుసార్లు నిర్వహించే ఈ వైద్యశిబిరాన్ని ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు. గ్రామాల్లో నిర్వహించే ఈ వైద్యశిబిరంలో వైద్యపరీక్షలను నిర్వహిస్తున్నామనీ, 62రకాల మందులు అందుబాటులో ఉన్నాయని, రోగికి అవసరమైన మేరకు అందజేస్తున్నామని తెలిపారు. గ్రామాల్లో మంచాన పడి ఉన్న రోగుల ఇళ్ల వద్దకు వెళ్లి వైద్యసేవలను అందిస్తున్నామన్నారు. గ్రామాల్లో నిర్వహిస్తున్న ఈ ఫ్యామిలీ డాక్టర్ విధానానికి మంచిస్పందన లభిస్తోందని, రోగాల బారినపడి గ్రామాల్లో ఏ ఒక్కరూ ఉండకూడదనే ఉద్దేశంతో విధులను నిర్వహిస్తున్నామని, ప్రజలంతా ఈ వైద్యశిబిరాన్ని వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఏఎన్ఎంలు, ఆశవర్కర్లు, సీహెచ్ఓలు, 104 సిబ్బంది, డేటాఎంట్రీ ఆపరేటర్‌లు పాల్గొన్నారు.

గృహ నిర్మాణాలు వేగవంతం చేయాలి



లబ్ధిదారులకు సూచనలు చేస్తున్న కమిషనర్, ఏఈ

పాలకొండ రూరల్: జగనన్న కాలనీలో ఇళ్ల స్థలాలు పొందిన లబ్ధిదారులు గృహ నిర్మాణ పనులు వేగవంతం చేయాలని నగర కమిషనర్ ఎస్.సర్వేశ్వరరావు అన్నారు. బాసూరివారివీధి సచివాలయంలో హౌసింగ్ ఏఈ మాధవరావుతో కలిసి మంగళవారం గృహ నిర్మాణ లబ్ధిదారులతో సమావేశమై ప్రభుత్వం అందిస్తున్న రాయితీలపై అవగాహన కల్పించారు. నిర్మాణాల తాజా పరిస్థితిపై ఆరా తీశారు. కాలనీలో రోడ్డు, విద్యుత్, తాగునీరు తదితర మౌలిక వసతులు సమకూర్చడం జరిగిందన్నారు. నిర్మాణ పనులకు అనుగుణంగా బిల్లులు ఎప్పటికప్పుడు చెల్లిస్తున్నామన్నారు. లబ్ధిదారులు ప్రభుత్వం అందిస్తున్న తోడ్పాటును అందిపుచ్చుకొని నిర్మాణాలు వేగవంతం చేయాలని కోరారు.

గిరిజన ప్రాంతాల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి



కల్వర్టు నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న నాయకులు

భామిని:

బురుజోల నుంచి మంద్రుంగూడకు రోడ్డు, కల్వర్టుల నిర్మాణానికి వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు తోట సింహాచలం, సర్పంచ్ మడపాన కేశవరావు మంగళవారం భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..గిరిజన ప్రాంతాల అభివృద్ధిపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందన్నారు.

ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి చొరవతో మంద్రుంగూడ రోడ్డు నిర్మాణానికి ప్రభుత్వం గిరిజన సంక్షేమశాఖ నిధుల నుంచి రూ.60 లక్షలు మంజూరు చేసిందన్నారు. కార్యక్రమంలో పెద్దదిమిలి సర్పంచ్ తొగరాన శ్రీను, మాజీ ఎంపీటీసీ పత్తిక సింహాచలం, వర్క్ఇన్‌స్పెక్టర్ సీహెచ్ భీష్మా, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

చేతికందిన మొక్కజొన్న గింజలు

- రూ.2,200నుంచి 2,400 పలుకుతున్న క్వింటా ధర



సీతారాంపురంలో యంత్రాలతో మొక్కజొన్నకండెలనుండి గింజలు

సీతానగరం: మండలంలోని పలుగ్రామాల్లో పండించిన మొక్క జొన్నపంటను ఇళ్లకు చేర్చి, కండెల నుంచి గింజలు వేరుచేసే పనుల్లో రైతులు నిగ్నమయ్యారు. ఖరీఫ్ వరిపంట కోతలనంతరం మాగాణీ భూముల్లో జీరో టిల్లేజీ విధానం ద్వారా అప్పయ్యపేట, కొత్తవలస, గెడ్డలుప్పి, పెదంకలాం, ఏగోటివలస, రంగంపేట, రేపటివలస, బగ్గందొరవలస, తామరఖండి ,లచ్చయ్యపేట, చినభోగిలి, లక్ష్మీపురం గ్రామాల రైతులు నీటివసరులున్న భూముల్లో (120 హెక్టార్లు) జీరోటిల్లేజ్ విధానం ద్వారా మొక్కజొన్న పంటసాగు చేశారు. పంట కోతకు రావడంతో కండెలనుంచి గింజలు వేరు చేసే యంత్ర పరికరాల ను ప్రభుత్వం రాయితీపై రైతులకు సమకూర్చింది. ఈ నేపథ్యంలో పండిన మొక్క జొన్న పంటలో కంకులను విడదీసి కండెలను కూలీలతో కళ్లాలకు చేర్చి ఆరబెట్టే పనులతో పాటు గింజలను వేరుచేయడంలో రైతులు నిమగ్నమయ్యారు. ఈ ఏడాది జొన్న పంట ఇళ్లకు రాక ముందు రూ.2.400 నుంచి 2,500 పలికేది. పంట విక్రయానికి రైతులు సిద్ధం చేస్తున్న సమయంలో కేంద్ర ప్రభుత్వం మద్దతు ధర ఇవ్వక పోగా కనీసం కొనుగోలు కేంద్రమైనా ఏర్పాటు చేసిన దాఖలాలు లేవని రైతులు ఆరోపిస్తున్నారు. కొనుగోలు కేంద్రం లేకపోవడంతో దళారులకు విక్రయించాల్సి వస్తోందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం స్పందించి రైతులు పండించిన జొన్నపంటకు క్వింటాకు గిట్టుబాటు ధర రూ.2,400లు ఇవ్వాలని, జొన్నరైతులకు రాయితీలు ఇవ్వాలని, ఇటీవల అకాల వర్షాలు సమయంలో ఈదురుగాలికి పంట నష్టపోయిన రైతులకు పంటలబీమా పథకం ద్వారా పరిహారం చెల్లించాలని కోరుతున్నారు.



తామరఖండిలో కళ్లాల్లో ఆరబెట్టిన జొన్నగింజలు

కేంద్రమే కొనుగోలు చేయాలి



రైతులు పండించిన జొన్న పంటను కేంద్ర ప్రభుత్వం రైతుభరోసా కేంద్రాల ద్వారా కొనుగోలు చేయాలి. గత ఏడాది కేంద్రమే కొనుగోలు చేసింది. గిట్టుబాటు ధర కల్పించి రైతుల కళ్లాల్లో ఉన్న జొన్నల నిల్వలను మద్దతు ధరకు సేకరించాలి. ఈదురుగాలికి పంటనష్టం వాటిల్లిన జొన్న రైతులకు ఆర్థిక సాయం అందించాలి.

సీహెచ్ సురేష్‌కుమార్, రైతు,లక్ష్మీపురం

త్వరలో కొనుగోలు కేంద్రం ఏర్పాటు



రైతులు వివిధ పద్ధతుల్లో జొన్నపంట సాగు చేశారు. పంట కోత పనుల్లో రైతులు నిమగ్నమై ఇళ్లకు పంట చేరుస్తున్నారు. పంటంతా ఇళ్లకు చేరుతున్న సమయంలో రైతు భరోసా కేంద్రాల ద్వారా జొన్నగింజలు కొనుగోలు చేయడానికి ఏర్పాట్లు చేస్తున్నాం. రైతులు చేయాల్సిందల్లా జొన్న గింజల్లో తేమ లేకుండా జాగ్రత్తలు తీసుకుంటే గిట్టుబాటు ధరవస్తుంది.

ఎస్.అవినాష్, ఏఓ, సీతానగరం